మా ఆవిడకి పతి దొరికాడు

పొద్దున పది గంటలు అయింది. ఆనందరావు నెత్తిన చేతులు పెట్టుకుని కూర్చున్నాడు. ఇంట్లో వాతావరణం అంతా అస్తవ్యస్తంగా వుంది. అవతల ఆఫీసు టైమయిపోయింది. ఇంకా టిఫిన్ రెడీ కాలేదు. పిల్లల స్కూలు బస్ మిస్ అయింది.

టిఫినుదేముంది? బయట ఎక్కడైనా తినొచ్చు. కానీ అలా వెళ్లిపోతే రమకి కోపం వస్తుంది. అసలే అగ్గిబుగ్గి అయిపోతోంది. ఇంకా రెచ్చగొడితే ఏదైనా అఘాయిత్యం చేస్తుందేమోనని భయం. ఎంతసేపు కూర్చున్నా వంటింట్లోంచి వూడిపడదు.

కాసేపు నీళ్ళు నమిలి మెల్లిగా వంటింటివైపు వెళ్ళాడు. పొయ్యిమీద వుంచిన పదార్థం మాడిపోతున్నా పట్టించుకోకుండా దిగులుగా నిలబడి వుంది రమ.

స్టౌ ఆపేసి భార్య భుజం మీద చెయ్యి వేశాడు.

"పతీ" అంటూ భోరున ఏడిచింది రమ.

"ఏడవకు ఏడవకు... ప్రయత్నం చేస్తున్నాను కదా!" ఓదార్చాలని విఫల ప్రయత్నం చేశాడు ఆనందరావు.

"చేసేదంతా చేసి ఇపుడు ఏం ప్రయత్నం చేస్తే ఏం లాభం" వుక్రోషంగా సమాధానం చెప్పి మళ్ళీ 'పతీ' అంటూ ఏడుపు ప్రారంభించింది రమ.

మరోసారి తలబాదుకుని బయటికి వచ్చాడు ఆనందరావు.

అపుడే మేడదిగి వచ్చాడు బాబాయ్.

"ఒరే ఆనందా! ఇంకా టిఫెను రెడీ కాలేదూ...?" అన్నాడు.

పళ్ళు కొరుక్కున్నాడు ఆనందరావు.

ఇంతలో వాకిట్లోంచి వచ్చింది రాజ్యం అత్తయ్య. ఆవిడ చేతిలో నవనవలాడుతున్న సొరకాయ.

"ఒరే ఆనందా! ఇవాళెందుకో మీ మావయ్య తెగ గుర్తొస్తున్నార్రా... ఆయనకి సొరకాయ ఆవబెట్టిన కూరంటే చచ్చేంత ఇష్టం. పతిగాడెక్కడున్నాడో కాస్త తొందరగా చూడ్రా... వాడయితే బాగా చేస్తాడా కూర" అంది ఆదరంగా.

కడుపులోంచి దుఃఖం తన్నుకొచ్చింది ఆనందరావుకి.

చేతుల్లో మొహం దాచుకుని కుళ్లికుళ్లి ఏడవసాగాడు. వంటింట్లోంచి వచ్చిన రమ భర్త పక్కనే కూర్చుని 'పతీ' అంటూ ఏడవసాగింది.

రమాపతికీ ఇరవై ఏళ్ళుంటాయి. మెరిక లాంటి వాడు. నమ్మకస్తుడు.

రమ ఫ్రెండ్ ఇంట్లో రెండేళ్ళుగా పనిచేస్తున్నాడు. ఆవిడ అమెరికా వెళ్లిపోతూ రమ దగ్గరకు పంపించింది. అతని గురించి ఫోన్‌లో గొప్పగా చెప్తుంటే "ఎందుకు లేవే!" అంది రమ నిరాసక్తిగా.

"అలాకాదు, నలుగురు వచ్చిపోయే యింట్లో ఎంత కష్టంగా ఉంటుందో నాకు తెలీదా... పైగా నీకేం తక్కువ... !?బోలెడంత ఆస్తి.... హాయిగా కాలు మీద కాలువేసుకుని ఎన్‌జాయ్ చెయ్యక ఎందుకొచ్చిన హైరానా నీకు....!?" అంది రమఫ్రెండ్.

మరి కాసేపటికే వచ్చాడు రమాపతి. రమ అతడిని చూడగానే "పని వచ్చా? నమ్మకంగా చేస్తావా!?" అని అడగలేదు...

"హీరోలా వున్నావ్.. నీకెందుకీ పనులు సినిమాల్లోకో, కనీసం టి.వి.ల్లోకో వెళ్ళకపోయావా" అంది.

సిగ్గుగా నవ్వేశాడు రమాపతి. "పొండి అమ్మగారు!" అంటూ.

ఇంటి పరిస్థితులను వివరించి చెప్పింది రమ.

అన్నింటికీ తలాడించాడు రమాపతి. అన్నీ విని కైకేయిలా తను కూడా మూడు వరాలు అడిగాడు.

మొదటిది జీతం మరో రెండువందలు ఎక్కువ ఇవ్వాలి. రెండవది ఇంట్లో పాచిపనికి తన మేనత్తని పెట్టాలి. మూడవది నెలకి రెండు రోజులు శెలవు కావాలి.

అన్నింటికీ సరే అంది రమ. సోమవారం నుండి పనికివస్తానని చెప్పి వెళ్ళాడు. సోమవారం తెల్లారేసరికల్లా మేనత్తని వెంటబెట్టుకు వచ్చాడు.

ఇద్దరు కలిసి ఇంటిని హేండోవర్ చేసుకొన్నారు. పొద్దున్న పదిగంటలు అయ్యేసరికి ఇంటి స్వరూపం మారిపోయింది. అద్దంలా వున్న ఇంటిని చూసి రమ భర్త ఆనందరావు మురిసిపోయాడు.

ఇంటి పనులు, బజారు పనులు సమస్తం చెయ్యడమే కాకుండా బాబాయ్‌నీ, అత్తయ్యనీ కూడా చాలా చక్కగా హేండిల్ చేస్తాడు (ఈ బాబాయ్ గురించి, అత్తయ్య గురించి రావోయి చందమామా కథలో రాయడం జరిగింది).

"పెద్దమ్మగారు! లేత చింతకాయలు తెచ్చాను. మీ వారికిష్టంట కదా... పచ్చడి చేస్తా, తినండి. ఆయనికి అర్ధభాగం తృప్తిగా ఉంటుంది" అంటాడు రాజ్యం అత్తయ్యతో. బాబుగారూ నా పనైపోయింది. పదండి మాయాబజార్ సినిమా చూద్దాం అంటాడు బాబాయిగారితో.

వారం రోజులు తిరిగేసరికి రమాపతి లేకుండా అసలు ఇన్నాళ్ళూ ఎలా ఉన్నాం అనుకున్నాను రమా, ఆనందరావు అయితే అతని పేరుతోనే కాస్త చిక్కు వచ్చింది.

పన్లో చేరిన కొత్తలో 'రమాపతీ... రమాపతీ'... అని పిలవడం మొదలు పెట్టింది రమ. కానీ అప్పటిదాకా కూనిరాగాలు తీస్తూ పనిచేస్తున్న వాడు సీరియస్ కావడంతో తెల్లబోయింది.

విషయమేమిటని అతని మేనత్తని అడిగారు రమ, ఆనందరావు.

"అమ్మగారూ! మీకోమాట చెప్పాలి – మా వాడికి తన పేరంటే చాలా చిరాకు. వాళ్ళమ్మకి ఆడపిల్లలంటే ముద్దు. అందరూ కొడుకులే. వీడే కడసారివాడు. అందుకే ఆరేళ్ళొచ్చేదాకా జుట్టుపెంచి – జడవేసి, పరికిణీలు కట్టి ఆడపిల్లలా పెంచింది. ఆ వేషం చూసి, ఆడపిల్లలందరూ ఏడిపించేవారు. కాస్త పెద్దవగానే క్రాపు చేయించుకున్నాడు. అయినా తన పేరులో ఆడతనం మిగిలిపోయిందని బాధ. పూర్తిపేరు పెట్టి పిలిస్తే వాడికి చిర్రెత్తుకొస్తుంది."

"మరైతే.. 'రమా!' అని పిలవ మంటావా?" అన్నాడు ఆనందరావు చికాగ్గా.

"రామ... రామ...! అలా రమా అని పిలిస్తే పనొదిలి పోతాడు" అంది మేనత్త. ఆ దంపతుల గుండె తారుమంది.

"మరైతే ఏం చెయ్యమంటావు?" అన్నారు ముక్తకంఠంతో.

"పతి... అని పిలవండి" అంది.

నెల్రోజులు గడిశాయి. పిల్లలూ, పెద్దలూ అందరూ రమాపతి పనిపట్ల ముగ్ధులైపోయారు. అన్ని పనులూ అతనికి అప్పచెప్పి నిశ్చింతగా వుండడం మొదలు పెట్టారు.

ఓరోజు ఆనందరావు బంధువులు భోజనానికి వచ్చారు.

“అంతా బాగానేవుంది బావగారు! అ పనివాడిని మా అక్క పతీ... పతీ అని మురిసిపోవడం నాకు నచ్చలేదు సుమండీ. మా అక్క రమ! వాడు రమాపతి! మరి మీరెవరు!” అన్నాడు ఆ గుంపులోని బావమరిది వరసైన ఒ ప్రబుద్ధుడు.

ఆనందరావు మనసు చిపుక్కుమంది పైకి నవ్వేసి వూరుకున్నాడు ఆనందరావు.

మరి కొద్దిరోజులకే ఎవరో ఫ్రెండ్స్ వస్తే వాకిట్లో వరండాలో కూర్చుని మాట్లాడుతున్నాడు ఆనందరావు.

లోపల్నించి “పతీ... పతీ” అని అరిచింది రమ.

“మీ మిసెస్ పిలుస్తున్నారు” అన్నారు వాళ్ళు.

“అబ్బే నన్నుకాదండీ మా పనివాడిని” అన్నాడు ఆనందరావు.

“ఏమిటీ మీ ఆవిడ పనివాడిని పతీ అంటుందా...!? మరి మిమ్మల్నేమంటుంది?” అంటూ భళ్ళున నవ్వేశారు.

ఈ సారి కాస్త సీరియస్‌గా రియాక్ట్ అయ్యాడు ఆనందరావు. ఆ రాత్రి రమతో చర్చించాడు.

“చాల్లెండి మీదంతా విచిత్రం వాగేవాళ్ళు ఏదో వాగుతునే వుంటారు” అనేసింది రమ.

“అలా కాదు రమా! వాళ్ళన్నదాంట్లో పాయింటు లేకపోలేదు” అన్నాడు ఆనందరావు.

“మరైతే పర్యవసానం ఆలోచించండి” అనేసి పడుకుని నిద్రపోయింది రమ.

ఆనందరావుకి మాత్రం నిద్ర పట్టలేదు.

రమాపతిని ఎలా పిలవాలి – రమా అంటే వాడిక్కోపం, పతీ అంటే బాగోలేదు. మరెలా??

మర, రప, మాప, పర, మతి అనుకుంటూ ఎన్నో కాంబినేషన్లు ప్రయత్నించి చూశాడు. ఏదీ కుదర్లేదు.

తెల్లారాక రమాపతిని పిల్చి "పతీ నిన్ను ముద్దుగా 'చిన్నా' అని పిలవమంటావా?"

"ఎద్దులా వున్నాను, నేను చిన్నాని ఏమిటండీ" అన్నాడు పతి.

"పోనీ అబ్బాయ్' అనమంటావా?"

"అబ్బాయిని కాక అమ్మాయినా? అయ్యగారు నన్నేమైనా అనండి, నా పేరునడ్డం పెట్టుకుని ఏడిపిస్తే నేనూరుకోను, అంతగా మీ కిష్టం లేకపోతే చెప్పండి నేను వదిలేసి పోతాను" అన్నాడతను సీరియస్‌గా.

"అమ్మమ్మ వద్దులే...' అన్నాడు ఆనందరావు.

ఏదైనా ఇబ్బంది అనిపించనేకూడదు. ఒకసారి అలా అనిపించడం మొదలుపెడితే అతి చిన్న సమస్య కూడా భూతంలా కనిపిస్తుంది. ఆనందరావు పనీ అలాగేవుంది.

ఎవరి ఎదటైనా అతన్ని రమ "పతీ" అన్నప్పుడల్లా ఇతని మనసు కలుక్కుమంటూనే వుండేది.

ఒకసారి ఆనందరావు ఆఫీసువాళ్ళందరూ పిక్నిక్ ప్రోగ్రాం వేశారు. కార్తీకమాసం కూడా కలిసొచ్చింది.

"పిల్లలని చూసుకుంటాడు, వాళ్లు నా మాట వినరు, నేను పెడితే తినరు" అంటూ రమాపతిని కూడా ప్రయాణం చేయించింది రమ.

వాడు వెంటరావడం ఇష్టంలేక పోయినా రమ వినదు కాబట్టి ఊరుకున్నారు ఆనందరావు.

అందరూ వచ్చారు. వన భోజనాల ఏర్పాట్లు కూడా బ్రహ్మాండంగా వున్నాయి. పెద్దవాళ్ళు పిల్లలైపోయారు. ఆనందరావు పేకాడుతున్నాడు. మరోవైపు గేమ్స్ జరుగుతున్నాయి. మ్యూజికల్ ఛైర్స్ వగైరాలు అయ్యాయి. మరో గేమ్ ప్రారంభం అయింది. వచ్చినవాళ్ళందరి పేర్లూ ఓ డబ్బాలో వేసి ఒక్కోటి తీసి వారిని పిల్చి ఆటలు ఆడిస్తున్నారు. ముచ్చటగా మూడో పేరు రమ చీటీ వచ్చింది.

"మీరు మీ శ్రీవారితో కలిసి మాంచి రొమాంటిక్ డ్యూయెట్‌కి డ్యాన్సు చేయాలి" అని వుంది. అంతా గొల్లున నవ్వేశారు. 'నేన్రాను... నేన్రాను...' అని మొహమాట పడుతున్న రమని ముందుకి నెడుతున్నారు ఫ్రెండ్స్.

ప్రోగ్రాం కండక్ట్ చేస్తున్నాయన "లాభంలేదు.. రమగారూ... రావాలి, రమాపతిగారు కూడా ఎక్కడున్నా స్టేజీమీదకు రావాలి".. అన్నాడు మైకులో...

సిగ్గుపడుతూ వెళ్ళింది రమ.

ఆనందరావు పక్కవాళ్ళకి తన ముక్కలు అప్పచెప్పి వెళ్ళబోయేలోగానే "రమగారు వచ్చేశారు. ఇక రమాపతిగారు రావాలి" అనే ఎనౌన్స్‌మెంట్ వినిపించడం, వెంటనే ఆదరాబాదరాగా పిల్లలకి అన్నం తినిపిస్తున్న రమాపతి స్టేజి మీదకి వెళ్ళడం క్షణంలోనే జరిగిపోయింది.

ఒక్క క్షణం అందరూ తెల్లబోయారు. మరుక్షణం అంతా ఘొల్లున నవ్వేశారు. గోలగోల చేశారు.

రమ గతుక్కుమని వెంటనే సర్దుకుంది. "పతీ... పిల్చింది నిన్ను కాదు అయ్యగారిని" అంది నవ్వేస్తూ.

ఆనందరావు మాత్రం అంత తేలిగ్గా తీసుకోలేదు. సాయంత్రందాకా ఫ్రెండ్స్ ఏడిపిస్తూ వుంటే లోలోపలే ఉడికిపోయాడు.

ఇంటికి రాగానే రమాపతి మీద ఒంటికాలిమీద లేచాడు. రమాపతి ఏదో చెప్పబోతుంటే కొట్టినంత పని చేశాడు.

రమ అడ్డుపడి ఆపింది. "మీరు ఆవేశంలో వున్నారు. వెళ్ళి పడుకోండి, రేపు తెల్లారాక మాట్లాడుకుందాం" అంది.

తెల్లవారేసరికి రమాపతీ లేడు, వాడి మేనత్తాలేదు, రమ గుండె ఠారుమంది.

"పోతే పోయాడు పీడా వదిలింది. వీడి తాతలాంటివాడిని మరొకడిని తెస్తాను" అంటూ బీరాలు పోయాడు ఆనందరావు.

తాత లాంటి వాడు కాదు కదా... మనవడి లాంటి వాడు కూడా దొరకలేదు. ఫలితం ఆ ఇల్లు మళ్ళీ ఒక సర్కస్ డేరాలా తయారయింది.

పనివాడు వుండనీ, లేకపోనీ బాబాయ్ గారికీ, అత్తయ్య గారికీ వేళకి అన్నీ అమర్చాలి.

ఇవి కాక భర్తపనీ, పిల్లలపనీ... రమ హూనం హూనం అయిపోసాగింది. భార్య అవస్థ చూడలేక ఏమీ చేయలేక అవస్థ పడిపోతున్నాడు ఆనందరావు. నాలుగు

రోజులు హోటల్ నుంచి తెప్పించాడు. పిల్లలు సర్దుకుపోయినా బాబాయ్, అత్తయ్యా మాత్రం గొడవ చేసేశారు.

సమస్య తీవ్రతరం అయింది. రమ శారీరకంగా కన్నా మానసికంగా కుంగిపోయింది.

"అమ్మా.. అమ్మా... అంటూ కడుపున పుట్టిన బిడ్డలా వుండేవాడు. అలాంటి వాడిని అన్యాయంగా వెళ్ళగొట్టారు" అంటూ గుర్తు చేసుకుని ఏడుస్తుంటే, పశ్చాత్తాపంతో బాధపడ్డాడు ఆనందరావు.

రమాపతి కోసం వెతికించడం మొదలుపెట్టాడు. ఈ ఊళ్ళో ఎవరికైనా పనిచేశాడేమో వాకబు చేస్తే లేదని తెలిసింది. వాళ్ళ ఊరికి మనిషిని పంపించాడు. ఇష్టదైవాలకి దణ్ణాలు పెట్టాడు.

పిల్లలు బెంగపెట్టుకుని 'నాన్నా పతి ఎప్పుడొస్తాడు' అని అడుగుతున్నారు. అస్తమానం "పతీ" అంటూ తల్చుకుని తల్చుకుని ఏడుస్తోంది రమ. అతి కష్టంమీద వారం రోజులు గడిచాయి. ఊరికి వెళ్ళిన పెద్దమనిషి కూడా రిక్తహస్తాలతో తిరిగి వచ్చేశాడు.

నిలువునా నీరయిపోయాడు ఆనందరావు.

ఓనాడు...

రాత్రి పది గంటలయింది. ఫోన్ మోగింది. తీసి 'హలో' అన్న ఆనందరావు ఆనందంతో ఎగిరి గంతేశాడు.

"పతీ నువ్వా!" అన్నాడు.

"అయ్యగారూ! బుద్ధి గడ్డితిని మీకు చెప్పకుండా వచ్చేశాను. మిమ్మల్నందర్నీ వదిలి ఉండలేకపోతున్నాను. మీ ఇష్టం వచ్చిన పేరుతో పిలవండి. మీరేం పిలిచినా పలుకుతాను. మళ్ళీ పన్లోకి రావొచ్చా?" దీనంగా అడిగాడు.

"మేమూ నిన్ను వదిలి వుండలేక పోతున్నాం. నీ ఇష్టం వచ్చిన పేరుతోనే పిలుస్తాం... వచ్చెయ్, ఇన్నాళ్ళూ రాకపోతే వేరే చోట పనికి కుదిరావనుకున్నా" అన్నాడు ఆనందరావు.

"ఒకచోట పని కుదిరిందండి. కానీ పతీ అని పిలవాలనగానే ఆ ఇంటాయన తాడియెత్తున లేచాడండి. ఆయన భార్య పేరు 'సతి'ట!"

ఫక్కున నవ్వాడు ఆనందరావు.

ఈ సంభాషణ వింటున్న రమ ఒక్క గెంతుతో ఫోన్ దగ్గరికి వచ్చేసింది.

"ఎవరూ...? పతే...?" అంది సంభ్రమాశ్చర్యాలతో

"అవును పతే! ఇదుగో మాట్లాడు" అంటూ ఫోన్ అందించాడు.

"పతీ! ఎలా వున్నావు? ఎక్కడున్నావు? త్వరగా వచ్చెయ్" అని రమ అంటూవుంటే బాధ అనిపించలేదు సరికదా – "అమ్మయ్య నా భార్య ఇకనైనా ఆనందంగా వుంటుంది. పతి దొరికాడుగా" అనుకున్నాడు ఆనందరావు తృప్తిగా.

హాసం 16–29 ఫిబ్రవరి 2004